## క్లుప్తంగా

### రేపు గోదా దేవి జయంతి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని మామిదాల పాడు సమీపంలోని గోదా గోకులంలో తిరు నక్ష త్రాన్ని పురస్కరించుకుని ఈనెల 22వ తేదీ గోదాదేవి జయంతిని నిర్వహించనున్నట్లు గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజుగుప్త తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం , ప్రత్యేక అలంకరణ, దర్శనం, విష్ణు సహస్ర నామ పారాయణం, సాయంత్రం పల్లకీ సేవ, పవళింపు సేవ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

### అధిక ఫీజు వసూళ్లను అరికట్టాలి

కర్నూలు (న్యూసిటీ): కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజు వసూళ్లను అరి కట్టాలని టీఎన్ఎస్ఎఫ్ కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి బొగ్గుల ప్రవీణ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ అధికారి గురువయ్య శెట్టికి వినతిపత్రం అందజేశారు.

### ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి విద్యా సంస్థల్లో చదువుకోవాలనే విద్యార్థులకు విద్యా సంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులు డిగ్రీలో ప్రవేశానికి పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు రెండేళ్లు, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఏడాది పాటు ప్రతి ఆది వారం ఉచితంగా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై అవగాహన

కర్నూలు కల్చరల్: చిన్నటేకూరు సమీపంలోని సీఈఎస్ ఫార్మసీ కళాశాలలో గురువారం బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కిమ్స్ హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాణాపాయ సమయాల్లో బేసిక్ లైఫ్ సపోర్ట్‌ను ఎలా అందించాలో వివరించారు. ఫిజీషియన్ డాక్టర్ వడ్డి మురళీ కృష్ణ హాజరై ఎమర్జెన్సీ మెడిసిన్ యూజెస్ గురించి వివరించారు. ప్రాణాపాయ సందర్భంగా సీపీఆర్ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవిప్రకాష్, ఫార్మాడీ విభాగాధిపతి డాక్టర్ ఆర్.తిరుమలేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

### త్రైమాసిక పన్ను రద్దు చేయాలి

కర్నూలు(రూరల్): లైట్ మోటార్ వెహికల్స్ మీద విధిస్తున్న త్రైమాసిక పన్నును రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. పన్ను రద్దు చేయాలంటూ గురువారం నగర శివారులోని ఆర్టీఏ కార్యాలయంలో డీటీసీకి వినతి పత్రం అందజేశారు.కరోనా సమయంలో రెండేళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రవాణా రంగం ఇపుడిపుడే కోలుకుంటోందని, ఈ తరుణంలో ఆర్టీఏ చలానాలు, గ్రీన్ ట్యాక్స్‌లు, రోడ్డు ట్యాక్స్‌లు, పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలతో మరింత ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మహమ్మద్, ప్రభాకర్, విజయ్, కుమార్, హుస్సేన్, అజాం, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

### హాస్టల్‌ను పరిశీలించిన డీవీఎంసీ సభ్యులు

కర్నూలు (అర్బన్): నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహాన్ని గురువారం సాయంత్రం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.శాంతికుమార్, రవిశాస్త్రి, రమేష్ బాబు తదితరులు పరిశీలించారు. ఆహార పదార్థాలు, వంట శాలను పరిశీలించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని హెచ్‌డబ్ల్యూఓ వెంకటరెడ్డికి సూచించారు.

### కల్లూరు ఇన్‌చార్జ్ ఎస్‌ఆర్‌గా హాజిమియ్య

కర్నూలు(సెంట్రల్): కల్లూరు ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా హాజిమియ్యాను నియమించారు. కల్లూరు ఇన్‌చార్జ్ ఎస్ఈ చైతన్య రాయలును ఇటీవల వైఎస్సార్ జిల్లా దువ్వూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు డిప్యుటేషన్‌పై పంపి, ఆయన స్థానంలో అవుకు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ హాజిమియ్యాను నియమిస్తూ స్టాంప్స్ డీఐజీ జి.కల్యాణి ఉత్తర్వులు జారీ చేశారు.

### సాక్షి సినిమాలు

**ఎస్‌వీసీ కాంప్లెక్స్:** బేబీ, ఒప్పెన్‌హీమర్, సామజవరగమన,హిడింబ, అన్నపూర్ణ ఫొటోస్టూడియో, బార్బీ, హర్ - చాప్టర్1, హత్య
**వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్:** సామజ వర గమన,కాజల్‌కార్తీక,హిడింబ,బేబీ, ఒప్పెన్‌హీమర్,అన్నపూర్ణ ఫొటోస్టూడియో, హత్య
**వెంకటేష్ సినీ కాంప్లెక్స్:** మహావీరుడు, బేబి, హత్య
**ఐనాక్స్:**ఒప్పెన్‌హీమర్, బార్బీ, మిషన్ ఇంపాజిబుల్: డెడ్ రెకనింగ్ పార్ట్ 1, హర్ - చాప్టర్1, అన్నపూర్ణ ఫొటోస్టూడియో
**భరత్ కాంప్లెక్స్:** నాయకుడు, మిషన్ ఇంపాజిబుల్ : డెడ్ రెకనింగ్ పార్ట్ 1,అలా ఇలా ఎలా, నాతో నేను
**శ్రీరామ:** స్నేక్ కేవ్ ,రాజ్ : హత్య
**విజయ :** మిషన్ ఇంపాజిబుల్ : డెడ్ రెకనింగ్ పార్ట్ 1

# యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- పత్తి సాగుకు ఆగస్టు మొదటి వారం వరకు అదును
- అంతర పంటలూ వేసుకోవచ్చు
- వ్యవసాయ శాఖ కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి



గార్గేయపురం సమీపంలో సాగైన పత్తి పైరును పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): యాజమాన్య పద్ధతులతో పత్తిలో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి(8331057433) రైతులకు సూచించారు. వర్షాలు ఆలస్యవుతున్నాయనే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎర్రనేలల్లో ఈ నెల చివరి వరకు, నల్లరేగడి నేలల్లో ఆగస్టు మొదటి వారం వరకు విత్తుకోవచ్చని సూచించారు. పత్తిలో అంతర పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై రైతుల కోసం ఆయన ఇచ్చిన మరింత సమాచారం..

☛ ఎర్ర నేలల్లో ఈ నెల చివరి వరకు మాత్రమే పత్తి వేసుకోవాలి. పత్తిలో అంతర పంటలుగా కంది, పెసర, అలసంద వేయవచ్చు. అనేక మంది రైతులకు కేవలం పత్తి మాత్రమే సాగు చేస్తున్నారు. పత్తి+ కంది పంటను 7 : 1 లేదా 10 : 1 ప్రకారం వేసుకోవచ్చు. పత్తి పప్పు దినుసుల పంటలు 4 : 1 విత్తుకున్న అధిక ఆదాయం పొందవచ్చు. పత్తి పంటను జూలై తర్వాత ఎర్ర నేలల్లో వేయరాదు.

☛ పత్తిలో అధిక దిగుబడికి మధ్యస్థ నూగు, కాయ పరిమాణం, పొడవు, వర్షం వచ్చినపుడు చిగురించే గుణం కలిగిన హైబ్రిడ్ పత్తి విత్తనాలు విత్తుకోవడం మేలు. విత్తనాన్ని ధ్రువీకరించిన విత్తన సంస్థ వద్ద పొంది రసీదు తీసుకొని పంట కాలం ప్యాకెట్ మీద చూసి విత్తనం కొన్న పంటపై ఏవైనా సమస్య వచ్చినపుడు విత్తన సంస్థ నుంచి నష్ట పరిహారం పొందవచ్చు.

☛ ఎకరాకు రెండు ప్యాకెట్ల విత్తనం సరిపోతుంది. తేమ బాగా ఉన్నపుడు 3 సెంటీమీటర్ల లోతులో నాటుకున్నట్‌లైతే మొలక శాతం బాగా ఉండి అధిక దిగుబడి పొందవచ్చు. మూడు అడుగుల ఎత్తు వరకు పెరిగే రకాలను సాలుకు సాలుకు 60 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 30 సెంటీమీటర్లు, లేదా ఆరు అడుగుల ఎత్తు పెరిగే రకాలను సాలుకు సాలుకు మధ్య 90 సెంటీమీటర్లు. మొక్కకు మొక్కకు మధ్య 45 సెంటీమీటర్లు ఉండే విధంగా విత్తుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చు.

☛ నీటి ముంపు ఉన్న ప్రాంతాల్లో బోదె చేసుకొని నాటుకున్న మొక్కలు చనిపోయే అవకాశం లేదు. ఇందువల్ల అధిక దిగుబడి సాధించవచ్చు. పశువుల ఎరువు ఎకరాకు 4 టన్నులు వేయాలి. విత్తనం విత్తుకునేటపుడు 50కిలోల డీఏపీ + 25 కిలోల యూరియా 5 సెంటీమీటర్లలోతులో విత్తుకోవాలి. 30 రోజులు, 70 రోజులలో 25 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ మొక్కకు 5 సెంటీమీటర్ల దూరంలో 3 సెంటీమీటర్లలోతులో తేమ ఉన్నపుడు వేసుకుంటే మంచి దిగుబడి పొందవచ్చు.

☛ ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవడం ద్వారా పత్తిలో నాణ్యత ఎక్కువగా ఉంటుంది. పంట 30 రోజులలో రసం పీల్చే పురుగులు ఆశించే అవకాశం ఉంది, అపుడు మోనోక్రోటోపాస్ 1.6 ఎంఎల్ లేదా ఇమిడాక్లోప్రిడ్ లేదా థైయోమిథాక్సిమ్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకొని నివారించుకోవచ్చు. పంటలో 60 రోజుల వరకు కలుపు లేకుండా చేసుకుంటే అధిక దిగుబడికి అవకాశం ఉంటుంది.

### సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- డీఈఓ వి.రంగారెడ్డి



మాస్టర్ ట్రైనర్లతో డీఈఓ రంగారెడ్డి

కర్నూలు కల్చరల్: ఉపాధ్యాయులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని డీఈఓ వి.రంగారెడ్డి సూచించారు. నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పదిరోజులుగా కర్నూలు, ఆదోని డివిజన్లలోని రెండు వేల మంది ఉపాధ్యాయులకు ఇస్తున్న ఐఎఫ్‌పీ శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులకు అశోక, జి.పుల్లారెడ్డి, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలల్లో శిక్షణ ఇచ్చామన్నారు. టెక్నాలజీకి అనుగుణంగా ఉపాధ్యాయులు అప్‌డేట్ అయి విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్యనందించాలన్నారు. కార్యక్రమంలో జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, కోర్సు కోఆర్డినేటర్లు ముల్లా మహమ్మద్‌బాషా, పరమేష్, వెంకటేష్‌తో పాటు మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

# స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుతున్నాం



కొండారెడ్డి బురుజు సమీపంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): స్మార్ట్‌సిటీగా కర్నూలును తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తెలిపారు. కొండారెడ్డి బురుజు వద్ద రూ.2 కోట్లతో చేపట్టిన పనులను గురువారం ఆయన పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరాభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. సచివాలయాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, బ్రిడ్జిలు, పార్కుల సుందరీకరణ, రహదారుల విస్తరణ, స్టేడియాల నిర్మాణం తదితర పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ షాషావలీ, మాజీ కార్పొరేటర్ మహేష్ ఉన్నారు.

# ఓటర్ల సర్వేకు పార్టీలు సహకరించాలి

- ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ భార్గవ్‌తేజ



మాట్లాడుతున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): ఈనెల 21 నుంచి నగరంలో చేపడుతున్న ఓటర్ల జాబితా సర్వేకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ కోరారు. గురువారం ఆయన నగరపాలక కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రంలో 2024 సంవత్సరం సాధారణ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఇంటింటి సర్వే, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ద్వారా పటిష్టమైన తుది ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు ఉపక్రమించామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, తమ తమ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో ఏవైనా ఇంటి నంబర్లు, ఓటర్ల వయస్సు, పుట్టిన తేదీలు, ఒకే ఇంటిలో ఎక్కువ మొత్తంలో ఓట్లు లాంటి పొరపాట్లను గమనించాలన్నారు. బీఎల్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు, జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, కర్నూలు అర్బన్ ఎంఆర్‌ఓ విజయశ్రీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇజాస్ ఆలీఖాన్ (వైఎస్సార్‌సీపీ) చంద్రహాస్ (తెలుగుదేశం ) బజారన్న (కాంగ్రెస్) రంగస్వామి (బీజేపీ), రాముడు (సీపీఎం), మధుకర్ (బహుజన్ సమాజ్ పార్టీ), మహేష్ (సీపీఐ), అనీఫ్ (ఎంఐఎం), అహమ్మద్ అక్బర్ హుస్సేన్ (ఆమ్ ఆద్మీ) పాల్గొన్నారు.

### సర్వే బాధ్యతతో నిర్వర్తించండి

ఈనెల 21 నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ఇంటింటి సర్వేను బాధ్యతతో నిర్వర్తించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. గురువారం నగరపాలక కౌన్సిల్ హాలులో బూత్ లెవల్ అధికారులతో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ సర్వే కోసం ప్రత్యేకంగా నిర్దేశించిన రిజిష్టర్లను అర్బన్ తహసీల్దార్ కార్యాలయం నుంచి సేకరించుకోవాలని బూత్ లెవల్ ఆఫీసర్లను సూచించారు. ఇప్పటికే 10 మంది కంటే ఎక్కువ ఉన్న సభ్యుల ఇళ్లను సర్వే చేసి పురోగతి సాధించిన బీఎల్‌ఓలను కమిషనర్ అభినందించారు.

# ప్రయాణికులకు సేవలందించండి



ఉత్తమ ఉద్యోగికి ప్రశంసాపత్రం అందజేస్తున్న వెంకటరామం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికులకు తగిన సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని కర్నూలు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి టి.వెంకటరామం సూచించారు. గురువారం కర్నూలు–2డిపోలో ఉత్తమ ఉద్యోగుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన పొదుపు కోసం ప్రతి డ్రైవర్ యత్నించాలన్నారు. ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా బస్సు నడిపితేనే సురక్షిత ప్రయాణాలు సాధ్యమన్నారు. సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు కండక్టర్లు కృషి చేయాలన్నారు. ప్రయాణికులు చెయ్యి ఎత్తిన ప్రతి చోటా బస్సు ఆపి, వారిని ఎక్కించుకుని, కోరిన చోట దించాలని, అప్పుడే సేవలు మెరుగుపడతాయని చెప్పారు. బస్సు కండీషన్ మెరుగుపర్చడంతో పాటు మైలేజీ అధికంగా వచ్చేలా గ్యారేజీ సిబ్బంది పనిచేయాలన్నారు. బస్సుల నిర్వహణ సక్రమంగా ఉంటే ఫెయిల్యూర్స్ తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీరు రజియా సుల్తానా, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు వెంకటరమణ, కర్నూలు–1, 2 డిపోల మేనేజర్లు సుధారాణి, సర్దార్ హుసేన్ పాల్గొన్నారు.

# జీసీలకు 100 అసెంబ్లీ సీట్లు కేటాయించాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 100 అసెంబ్లీ సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు కోరారు. గురువారం స్థానిక క్రిష్ణకాంత్ ప్లాజాలోని తన కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూశాయన్నారు. బీసీల ఓట్లతో అగ్రవర్ణ నాయకులు రాజ్యాధికారం అనుభవిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలను గుర్తించి టికెట్లు కేటాయించాలని, లేని పక్షంతో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను సమీకరించి ఉద్యమాలు చేపడతామన్నారు. అలాగే బీసీలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు బీసీ కార్పొరేషన్లకు నిధులను విడుదల చేయాలన్నారు. పార్లమెంట్‌లోనూ బీసీల వాణిని వినిపించేందుకు 50 శాతం సీట్లను కూడా కేటాయించాలన్నారు. సమావేశంలో సంఘం జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావుయాదవ్, రాష్ట్ర కార్యదర్శి అన్వర్‌హుసేన్, ప్రచార కార్యదర్శి మద్దూరు వెంకట్, వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

# ‘అన్నీ ఒకేచోట’ కల నెరవేరేదెన్నడు!?

- మంత్రి ప్రారంభించి రెండు నెలలైనా ఉపయోగంలోకి రాని రేడియో డయాగ్నోస్టిక్ బ్లాక్ సేవలు



ఆసుపత్రిలోని నూతన రేడియో డయాగ్నోస్టిక్ బ్లాక్

కర్నూలు(హాస్పిటల్): పెద్దాస్పత్రిలో అన్ని పరీక్షలు ఒకే చోట లభించాలన్న రోగుల కల నెరవేరడం లేదు. స్వయానా ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని రెండు నెలల క్రితం రేడియో డయాగ్నోస్టిక్ బ్లాక్‌ను ప్రారంభించినా ఇంత వరకు సేవలు అందుబాటులోకి తీసుకురాకపోవడంతో పెద్దాస్పత్రి అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నూతన బ్లాక్‌లోకి బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, పెథాలజీ విభాగాల ల్యాబ్‌లు(24 గంటల ల్యాబ్, సెంట్రల్ ల్యాబ్) రావాల్సి ఉంది. అలాగే రేడియాలజీ విభాగానికి చెందిన ఎక్స్‌రే యూనిట్లు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ల ఏర్పాటుతో పాటు బ్లడ్‌బ్యాంక్‌ను కూడా ఇదే భవనంలోకి మార్చాలి ఉంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న ల్యాబ్‌లు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్‌స్కానింగ్ మిషన్లను యథాతథంగా నూతన భవనంలోకి మార్చుకుని అవసరమైన మరికొన్ని పరికరాలు, వసతులు, సౌకర్యాలు సమకూర్చుకునే అవకాశం ఉంది. కానీ ఆయా విభాగాల వైద్యులు, అధికారుల మధ్య సమన్వయం కుదరకపోవడంతో రెండు నెలలుగా భవనం నిరుపయోగంగా ఉంది. దీనివల్ల ఒకేచోట అన్ని రకాల పరీక్షలు అనే ప్రభుత్వ ఆశయం నెరవేరకుండా పోతోంది.

# ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



రైతులకు సూచనలిస్తున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్

కర్నూలు (న్యూటౌన్): ఒకే రకమైన పంట కాకుండా, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పలు రకాల పంటలు వేయడంతో రైతుకు ఆదాయంతో పాటు నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలో సర్వసతి అనే మహిళ పొలంలో ప్రధాన పంట దేశీ పత్తి (నాన్‌బీటీ)తో పాటు 18 రకాల విత్తనాలకు బీజామృతంతో వేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల పంటలు వేయడంతో ఒకే పంటలో నష్టం వచ్చినా మరో పంట నుంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులందరికీ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ మల్లికార్జున, ఆంజనేయులు, యూనిట్ ఇన్‌చార్జ్ రమేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీ స్వెటర్లకు భలే గిరాకీ

**నాలుగు రోజులుగా వాతావరణం ముసురుకోవడంతో స్వెటర్లకు గిరాకీ పెరిగింది. కొందరు వ్యా పారులు ఢిల్లీ నుంచి తెచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో ఓ వ్యాపారి వద్ద ఉన్న స్వెటర్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ఆకట్టుకునే రంగుల్లో ఉండటం, సరసమైన ధరకు (రూ.200 నుంచి రూ.500) లభిస్తుండటంతో వినియోగదారులు ఇష్టంగా కొనుగోలు చేశారు.**

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు





స్వెటర్లను కొనుగోలు చేస్తున్న ప్రజలు

### మద్యం విక్రయదారుడి అరెస్ట్

కర్నూలు: తెలంగాణ నుంచి తక్కువ ధరకు మద్యం తీసుకువచ్చి కర్నూలులో విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో మూడో పట్టణ ఎస్‌ఐ రామకృష్ణ నిఘా వేసి ఒకరిని అరెస్టు చేశారు. బుధవారాపేట నుంచి పాతబస్తీకి వెళ్లే హంద్రీ బ్రిడ్జి కింద బుధవారపేటకు చెందిన బోయ మహేంద్ర మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ రామకృష్ణ తన సిబ్బందితో దాడి చేసి పట్టుకుని అతని వద్ద ఎనిమిది మద్యం బాటిళ్లు సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

### సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రూరల్): నగరంలోని నంద్యాల చెక్‌పోస్ట్, రెవెన్యూ కాలనీ, గణేష్ నగర్‌లలో సీపీఎం నాయకులు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ మాట్లాడుతూ తాగునీరు, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు పరిష్కరించాలని కోరారు. సీపీఎం నాయకులు ఉస్సేన్, సుబ్బరాయుడు, నరసింహ, శివకృష్ణ, జయ న్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సి.బెళగల్: మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. కల్లూరు మండలం ఎ.కొంతలపాడు గ్రామానికి చెందిన ఆంజనేయులు (30), భార్య బుజ్జమ్మ సి.బెళగల్‌లోని జెడ్పీ హైస్కూల్ వెనుక కాలనీలో గుడిసెను అద్దెను తీసుకుని నివాసముంటున్నారు. బుజ్జమ్మ సి.బెళగల్ కస్తూర్బా విద్యాలయంలో వంట సహాయకురాలిగా పనిచేస్తోంది. ఆంజనేయులు సొంత గ్రామానికి వెళ్లి వ్యవసాయం చేస్తూ తిరిగి వస్తూ ఉండేవాడు. వ్యవసాయ పెట్టుబడుల కోసం దాదాపు రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. వాటిని తీర్చేదారిలేక బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకున్నాడు. సాయంత్రం భార్య గమనించి స్థానికుల సాయంతో మృతదేహాన్ని కిందకు దించారు. గురువారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

# వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడతాం



పూడూరులో కబ్జాకు గురైన వక్ఫ్‌బోర్డు భూములను పరిశీలిస్తున్న జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్

కర్నూలు (న్యూటౌన్): కబ్జాదారుల చెర నుంచి వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుతామని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్ అన్నారు. గురువారం కర్నూలు మండలం పూడూరు గ్రామంలో కబ్జాదారుల చెరలో ఉన్న వక్ఫ్‌బోర్డు భూములను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పూడూరు గ్రామంలోని సర్వే నంబర్ 21–2లో 14.16 ఎకరాలు, 29లో 22.60, 53లో 14.64, 77/ఏ లో 25.65, 77/బీ 3.56, 129లో 1.80, 162లో 3.12, 224లో 35.60, 193బీలో 5.88 ఎకరాలు మొత్తం 143 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములున్నాయని తెలిపారు. కబ్జాదారులపై వక్ఫ్‌బోర్డు చట్టం పరంగా చర్యలు చేపట్టి, వీటన్నింటినీ వారి చెరనుంచి విడిపించి పూడూరు మసీదు ముతవల్లి చాంద్‌బాషాకు అప్పగిస్తామని చెప్పారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలకు సెమిస్టర్‌- 2 పుస్తకాలు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు రూరల్ పరిధిలోని 91 ప్రభుత్వ పాఠశాలలకు సెమిస్టర్ 2 పుస్తకాలను ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేసినట్లు కర్నూలు రూరల్–2 ఎంఈఓ కె వినోద్ కుమార్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 10వ తరగతులకు సంబంధించి సెమిస్టర్ –2 పుస్తకాలను ప్రతి ప్రభుత్వ పాఠశాలకు చేరవేస్తున్నామని అన్నారు. ఈ నెల 22వ తేదీన సెమిస్టర్–2 పుస్తకాలతో విద్యార్థులంతా ఫోటోలు దిగి అప్‌లోడ్ చేయాలని ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్లు, సీఆర్‌పీలను, సిబ్బందిని ఆదేశించారు.

### కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల డ్యాం నుంచి కర్నూలు నగర ప్రజలకు తాగు నీటి అవసరాల నిమిత్తం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు గురువారం తెలిపారు. జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని, డ్యాంలో ప్రస్తుతం 0.845 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు వెల్లడించారు.

# సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రము అందిస్తున్న కార్పొరేటర్

కల్లూరు: అర్హులై ఉండి పథకాలు రానివారిని గుర్తించి పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారని కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 29వ వార్డు శరీన్‌నగర్‌లో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించి లబ్ధిదారులు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ గోపాల కృష్ణ, స్పెషల్ ఆఫీసర్ క్రిష్టఫర్, నాయకులు తిరుమలేష్ గౌడ్, హుస్సేన్ ఆలం, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.